## క్లుప్తంగా

### రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

**నరసన్నపేట:** మేజరు పంచాయతీ పరిధిలోని సంతపేట నుంచి పసార వీధికి వెళ్లే రోడ్డును రూ.6 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. ఈ మేరకు రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ రోడ్డు శిథిలం కావడంతో ద్విచక్ర వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. సంతకు వెళ్లే వారితోపాటు ఇతర వాహనదారులు అవస్థలను గుర్తించి రోడ్డును అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు బి.ఎల్.శర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వండాన లక్ష్మణరావు, చీపురు నారాయణ, అంధవరపు పాపారావు, నేతింటి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

### సంతాపం..



చినఅప్పలనాయుడు (ఫైల్)

**సరుబుజ్జిలి:** మండలంలోని పాతపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు టంకాల చిన అప్పలనాయుడు గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావుకు సమీప బంధువు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమాని. జిల్లాలో పలు అధ్యాపక సంఘాలకు నాయకత్వం వహించారు. ఈయన మృతిపట్ల వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, ఎంపీపీ కిల్లి రమాదేవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సంతాపం తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన లక్ష్మణరావును 108లో తరలిస్తున్న దృశ్యం

**పొందూరు:** మండలంలోని కృష్ణాపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని లోలుగు గ్రామానికి చెందిన ఎం.లక్ష్మణరావు కృష్ణాపురం సమీపంలో గల స్తంభాల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. మధ్యాహ్నం పని నిమిత్తం ఫ్యాక్టరీకి బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావుకు కుడికాలు విరిగిపోవడంతోపాటు తలకు గాయమైంది. క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



చంగుడిలో మొక్కలు నాటుతున్న యువకులు

**పాతపట్నం:** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని చంగుడి గ్రామానికి చెందిన రైజింగ్ యూత్ సభ్యులు ఉమేష్ పండి, ప్రకాష్, రంజన్ అన్నారు. మండలంలోని సరాలి, చంగుడి గ్రామాల్లో రైజింగ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యుడు ఉమేష్ మాట్లాడుతూ.. మొక్కలను పెంచి కాలుష్యం లేని గ్రామాలుగా తయారుచేయాలన్నారు. యువకులు గౌరీశంకర్, ప్రకాష్ పండీ, కుమార్ జన్నా, గ్రామస్తులు పాల్గొన్నారు.

### తప్పులు సరి చేసుకోవాలి

**హిరమండలం:** ఎల్.ఎన్.పేట మండలంలోని 74 మంది రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు తప్పుగా ఉన్నాయని, వాటిని సరి చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కె.సింహాచలం తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 5,583 మంది రైతులు ఉన్నారన్నారు. వీరిలో 74 మంది రైతులకు సంబంధించి ఖాతాలు సరిగా లేవన్నారు. కొంతమంది ఖాతాలకు ఆధార్ లింక్ కాలేదన్నారు. ఖాతాలు సరిగా లేని జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో ఉంచినట్లు తెలిపారు. రైతులు వాటిని సరి చేసుకోవాలని సూచించారు. అప్పుడే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు డబ్బులు జమ అవుతాయన్నారు.

# ఆర్‌ఎస్‌కేల కుదింపు..!




మడపాంలో పశువైద్య శాలగా మారిన రైతు సేవా కేంద్రం

- నరసన్నపేట నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో 91 ఆర్‌బీకేల ఏర్పాటు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 10 ఆర్‌బీకేల తగ్గింపు
- నరసన్నపేట మండలంలో ఏకంగా నాలుగు ఎత్తివేత
- నిరుపయోగంగా రైతు సేవా కేంద్ర భవనాలు
- మండిపడుతున్న అన్నదాతలు



నరసన్నపేట మండల పరిషత్ ఆవరణలో ఎత్తేసిన ఆర్‌ఎస్‌కే భవనం

**నరసన్నపేట:** దేశానికే రోల్ మోడల్‌గా ఉండే రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం కుదించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు అనేక సేవలు అందేవి. రైతు విజ్ఞాన కేంద్రాలుగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. వీటి ద్వారా రైతులకు అందుతున్న సేవలను కూడా బాగా తగ్గించింది. కియోస్కో మిషన్లు మూలకు చేరాయి. వరి పంట ఈ–క్రాప్ ఆధారంగా రేషనలైజేషన్ బదిలీ పేరుతో ఆర్‌ఎస్‌కేలను కుదించింది. గత ప్రభుత్వ కాలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులకు అనేక పథకాలు అమలు చేశారు. ఆర్‌బీకే వ్యవస్థను తీసుకువచ్చి రైతుల చెంతకు వ్యవసాయ శాఖను తీసుకువచ్చారు. వైఎస్ జగన్‌కున్న మంచి పేరును చెరిపేసేందుకు ఆర్‌బీకేలను కూటమి ప్రభుత్వం కుదించిందని పలు గ్రామాల రైతులు అంటున్నారు.

**10 కేంద్రాల తొలగింపు..**

నరసన్నపేట నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 91 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటికి దాదాపుగా భవనాలను కూడా సిద్ధం చేసింది. అన్నిచోట్లా రైతులకు సంతృప్తిగా సేవలు అందేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 81 ఆర్‌ఎస్‌కేలకు కుదించింది. 10 కేంద్రాలను తొలగించింది. నరసన్నపేట మండలంలో నాలుగు, పోలాకిలో రెండు, జలుమూరులో మూడు, సారవకోటలో ఒకటి కుదించారు. నరసన్నపేట మండలంలో మడపాం ఆర్‌ఎస్‌కేని తొలగించి యారబాడులో కలిపేశారు. నరసన్నపేట టౌన్‌లో దేశవానిపేటతో పాటు మరో రెండు ఆర్‌ఎస్‌కేలను తొలగించి సత్యవరంలో కలిపారు. పోలాకి మండలంలో పల్లిపేట, గుప్పడిపేట, సారవకోట మండలంలో చీడిపూడి, జలుమూరు మండలంలో శ్రీముఖలింగం, రావిపాడు, చల్లవానిపేట కేంద్రాలను తొలగించారు. ఆయా గ్రామాల్లో రైతులు మండిపడుతున్నారు. మడపాం రైతులు యరబాడు వెళ్లాలా అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

### ఆర్‌బీకేలను కుదించడం శోచనీయం



నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలో వందలాది ఎకరాలు సాగు అవుతుంది. దేశవానిపేట ప్రాంతంలో రైతులు అధికంగా ఉన్నారు. ఇక్కడ ఆర్‌బీకేను ఎత్తివేయడం అన్యాయం. సత్యవరం వెళ్లాలంటే ఇబ్బందే. కూటమి ప్రభుత్వం నిర్ణయం సరికాదు. ఇప్పటికే రైతుల పట్ల కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఇప్పుడు ఈ విధంగా రైతులకు ఇబ్బంది కలిగించడం దారుణం.

– చింతు రామారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, దేశవానిపేట

### సేవలు సక్రమంగా అందేవి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో ఆర్‌బీకేలను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు మడపాంలో అనేక సేవలు అందాయి. రైతులు ఎంతో సంతోషించారు. ఇప్పుడు మాపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టినట్టు ఉంది. మా గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని ఎత్తివేశారు. ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న యారబాడు వెళ్లి సేవలు పొందాలని అంటున్నారు. ఈ విధంగా రైతులను కష్ట పెట్టడం సరైన పద్ధతికాదు. మడపాంలో యథావిధిగా రైతు సేవా కేంద్రాన్ని నిర్వహించాలి.

– మార్పు రాజశేఖర్, రైతు, మడపాం

## చోడసముద్రంలో వైద్య శిబిరం

**సారవకోట:** చోడసముద్రంలో వైరల్ జ్వరాల విజృంభణ అనే శీర్షిన గురువారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన బొంతు పీహెచ్‌సీ వైద్యులు సుస్మిత, సిబ్బంది గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గ్రామంలోని బావుల్లో క్లోరినేషన్ చేయించారు.

సాక్షి ఎఫెక్ట్



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సరుబుజ్జిలి: శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఏడీఏ రాజగోపాలరావు, వీఏఏలు



సారవకోట: మాట్లాడుతున్న ఏడీ మధు

**సరుబుజ్జిలి:** ఆర్‌ఎస్‌కేల్లో పని చేస్తున్న వీఏఏలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలని వ్యవసాయశాఖ కొత్తూరు డివిజన్ ఏడీఏ బొడ్డేపల్లి రాజగోపాలరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్‌ఎస్‌కే వద్ద గత మూడు రోజులుగా నిర్వహించిన కార్యక్రమం గురువారంతో ముగిసింది. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వివరాలు ఈ–క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి, బూర్జ, ఎల్.ఎన్.పేట ఏఓలు మన్మథరావు, సంధ్య, ప్రకృతి వ్యవసాయ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

**సారవకోట మండలంలో..**

**సారవకోట:** ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ నరసన్నపేట ఏడీ మధు సూచించారు. మండలంలోని బుడితి రైతు సేవా కేంద్రంలో వీఏఏ, హార్టికల్చర్ అసిస్టెంట్లకు ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వలన భూసారం తగ్గిపోతుందని, దీనివలన రానున్న రోజుల్లో పంటలు పండే అవకాశం ఉండదన్నారు. అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, వ్యవసాయాధికారి కె.సి.హెచ్.వెంకటరావు, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ రమణ ఉన్నారు.

### భయపెడుతున్నాయ్..



పాతపట్నం శివశంకర్ కూడలి వద్ద కుక్కల గుంపు

**పాతపట్నం:** నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కంద్రవీధి, శివశంకర్ కాలనీ, జుబ్లీ హిల్స్ రోడ్డు, కాపువీధి, బ్రాహ్మణవీధి, అచ్చుతాపురం, కోర్టు జంక్షన్, ఆస్పత్రి జంక్షన్‌లలో కుక్కలు గుంపులు తిరుగుతుండడంతో చిన్నారులు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాతపట్నం శివశంకర్ కాలనీ, నీలమణిదుర్గ అమ్మవారి కాలనీలో చిన్నారులపై వారం రోజుల క్రితం కుక్కలు దాడి చేశాయి. కొరసవాడ, కాగువాడ, బూరగాం, గంగువాడలో రాత్రిళ్లు బయటకు రావాలంటే భయమేస్తుందని, కుక్కలు వెంబడిస్తున్నాయంటున్నారు. కొరసవాడలో చికెన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నుంచి విసిరేసిన వ్యర్థాలు కుక్కలు తింటూ.. అటువైపు వెళ్లేవారిపై దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. గతంలో కొరసవాడలో రెండు ఆవులకు కుక్కలు కరిచిన సంఘటనలు జరిగాయి. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# 'కూటమి నాయకులను నిలదీయండి'

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్, అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా కూటమి నాయకులు.. ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు అన్నారు. ఆమదాలవలస మండలంలోని సైలాడ, జొన్నవలస గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రికాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చింతాడ రవికుమార్ హాజరయ్యారు. జలుమూరు మండలంలోని పెద్దదూగాం గ్రామంలో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు ఆధ్వర్యంలో, నరసన్నపేట మండలంలోని దూకులపాడు, తామరాపల్లిల్లో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. పాతపట్నం మండలంలోని సరాలి, చంగుడి గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఐటీ విభాగం అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం ఆధ్వర్యంలో, కొత్తూరు మండలంలోని గూనభద్ర అపోజిట్ ఆర్ఆర్ కాలనీ, కారిగూడ, మెట్టూరు బిట్–3, మెట్టూరు గూడ గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీపీ సవర సావిత్రి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ, రికాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: సైలాడలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు



జలుమూరు: పెద్దదూగాంలో క్యూ ఆర్ కోడ్‌ను చూపించి వివరిస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు



నరసన్నపేట: దూకులపాడులో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీపీ మురళి, నాయకులు



పాతపట్నం: చంగుడిలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: గూనభద్ర అపోజిట్ ఆర్ఆర్ కాలనీలో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# ఎరువుల కృత్రిమ కొరత

- ప్రైవేట్ డీలర్లకు లాభం చేకూర్చుతున్న కూటమి ప్రభుత్వం
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**హిరమండలం:** ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం సరిపడే అన్ని ఎరువులు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. సాగు చేస్తున్న భూమికి తగినన్ని ఎరువులు అందుబాటులో లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి, ప్రైవేట్ వ్యాపారులకు లాభాలు చేకూర్చుతుందన్నారు. అవసరం లేకపోయినా డబ్బు గుళికలు, వేప పిండి, నానో ఎరువులు వంటివి తీసుకోవాలని ప్రైవేట్ డీలర్లు బలవంతం చేస్తున్నారన్నారు. అదనపు ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నదాతల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు, ఈ–క్రాప్, పంటల బీమా వంటివి అందించారని గుర్తుచేశారు. రైతుకు పెట్టుబడి సాయం కింద ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా పథకం అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అన్నదాతల ప్రయోజనాలను కూటమి ప్రభుత్వం విస్మరిస్తే.. వారి పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు.

## దళిత డప్పు కళాకారులకు పింఛన్ ఇవ్వాలి




మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్

**హిరమండలం:** దళిత డప్పు కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలని దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గాసి గణేష్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బ్యారేజీ సెంటర్ వద్ద దళిత డప్పుకళాకారులతో గురువారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రంగస్థల కళాకారులకు ఇస్తున్న రూ.7 వేల పింఛన్‌ను దళిత డప్పు కళాకారులకు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోనూ డప్పు కళాకారులు ఉన్నారన్నారు. వీరంతా తరతరాలుగా డప్పు కళనే వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. డప్పు స్థానంలో తీన్మార్, కాంగో వంటి కళలు రావడం వల్ల డప్పుకళాకారులకు ప్రాధాన్యం తగ్గిందన్నారు. వారి జీవనం కష్టతరం అవుతుందన్నారు. దళిత డప్పుకళాకారులకు సాగుచేసుకునేందు భూమి అందించాలన్నారు. ఆగస్టు 29వ తేదీన ప్రాంతీయ సదస్సును కొత్తూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి డప్పు కళాకారులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్డసరి ప్రదీప్, రామారావు, రంగారావు, మహేష్, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సేవలే గుర్తింపునిస్తాయి



ఆమదాలవలస: వెంకటరమణ దంపతులను సన్మానిస్తున్న వంశధార సిబ్బంది

**జలుమూరు:** ఉద్యోగ విరమణ అనంతరం సమాజ సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీపీ వాన గోపి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ కొమరాపు అప్పలనాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జలుమూరు: ఎంపీడీఓ అప్పలనాయుడును సన్మానిస్తున్న ఎంపీపీ గోపి, తదితరులు

**ఘన సన్మానం..**

**ఆమదాలవలస:** చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు పరిశోధన విభాగం ఈఈ బొడ్డు వెంకటరమణ అన్నారు. ఈ ప్రాజెక్టు పరిశోధన విభాగంలో సీనియర్ సహాయకులుగా పనిచేసిన మీసాల వెంకటరమణ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. వెంకటరమణ దంపతులను అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను పలువురు ఉద్యోగులు కొనియాడారు.

### విద్యుత్ మీటర్‌ను రద్దు చేయాలి

**కొత్తూరు:** మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీకి చెందిన రౌతు వేణమ్మ తప్పుడు పత్రాలతో విద్యుత్ మీటర్ పొందారని అదే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మీటర్‌ను రద్దు చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి.. స్థానిక ట్రాన్స్‌కో ఏఈకి రాతపూర్వకంగా ఇదివరకే ఫిర్యాదు చేశారన్నారు. అక్రమంగా మీటరు పొందిన వేణమ్మ అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతోనే చాలా కాలం నుంచి తొలగించడం లేదన్నారు. ఇప్పటికైనా ఏఈ స్పందించి మీటర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

### అధ్వాన రహదారులు



సరుబుజ్జిలి గ్యాస్ గోదాం సమీపంలో ఏజీ రోడ్డు పరిస్థితి

సరుబుజ్జిలి మండలంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బయట కాలు పెట్టాలంటే ప్రజలు భయపడుతున్నారు. ప్రధానంగా ఆర్‌అండ్‌బీ రహదారుల విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోతులు పడిన రోడ్లను బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి



సరుబుజ్జిలి– మదనాపురం రహదారిలో శ్రీరామ్‌వలస వద్ద ఏర్పడిన గోతులు

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఐటీడీఏ ఉద్యానవన అధికారి గణేష్

**కొత్తూరు:** జీడి పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యానవన అధికారి గణేష్ అన్నారు. మండలంలోని మహసింగి వెలుగు కార్యాలయంలో జీడి పంట సాగు చేస్తున్న గిరిజన రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. జీడి చెట్లకు కొమ్ములు తొలగించినప్పుడు ముందుగా కొమ్మ కింద భాగాన గాటు పెట్టిన తరువాత పైభాగాన నరకడం చేయాలన్నారు. కొమ్మ నరికిన చివరి భాగంలో గత్తం పెట్టాలన్నారు. జీడి మొక్కలు లేనిచోట తిరిగి మొక్కలు నాటేందుకు ఐటీడీఏ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని 500 ఎకరాల్లో జీడి మొక్కలు నాటేందుకు ఎన్జీఓల ద్వారా పంపిణీ చేశామన్నారు. సొసైటీలకు చెందిన ఫారం పాండ్‌లు ఉన్నచోట చేప పిల్లలను ఎన్జీఓల ద్వారా గిరిజన రైతులకు అందించామన్నారు. వెలుగు ఎన్జీఓ కార్యదర్శి సంజీవరావు, కొత్తూరు, మెళియాపుట్టి, భామిని మండలాల నుంచి 28 మంది గిరిజన రైతులు పాల్గొన్నారు.